సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 11 । జనవరి । 2023



మదనపల్లెలో వైఎస్సార్‌సీపీ మెగా జాబ్‌మేళా

మదనపల్లెలో ఫిబ్రవరి 10న వైఎస్సార్‌సీపీ మెగాజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. -IIలో..



భారీ స్కోరు చేసిన ఆంధ్రా జట్టు

అంతర్ రాష్ట్రాల అండర్-25 క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు 541 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. -IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.160
రెండోరకం	రూ.70	రూ.108



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 160 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	530	701
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 475.68 కిలోలు

న్యూస్‌రీల్

సోమశిల ఎస్‌డీసీగా భాస్కర్



రాజంపేట: సోమశిల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా(ఎస్‌డీసీ) కె.భాస్కర్ (సోమశిల ప్రాజెక్టు యూనిట్-4)మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. అంతకముందు ఇన్‌చార్జి ఎస్‌డీసీగా కొనసాగిన రాజంపేట ఆర్డీవో కోదండ రామిరెడ్డిని కలిసి ఆయన నుంచి బాధ్యతలను తీసుకున్నారు. తన కార్యాలయంలో శాఖపరంగా పలు అంశాలపై కింది స్థాయి అధికారులతో సమావేశమై చర్చించారు.

సంఘమేశ్వర స్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



పూజల్లో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత

పెద్దతిప్పసముద్రం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీ.సుజాత మంగళవారం పెద్దతిప్పసముద్రం మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లికి విచ్చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పీ.శ్రీనాథ్‌రెడ్డి, మనోజ్‌జయంత్‌రెడ్డి ఘనంగా స్వాగతం పలికి శాలువలతో సత్కరించారు. అనంతరం ఆమె పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ పార్వతీ సమేత సంఘమేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పాపాఘ్ని నదీ పరిసరాలు ఆహ్లాదంగా ఉన్నాయని కితాబు నిచ్చారు. ఆలయ విశిష్టత గురించి వేద పండితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ ఎస్కార్ట్‌తో రోడ్డు మార్గంలో కర్ణాటక రాష్ట్రం చింతామణికి బయలు దేరి వెళ్లారు. తహసీల్దార్ విద్యాసాగర్, ములకలచెరువు సీఐ సాదిక్ అలీషా, సర్పంచ్ శారద, కార్యదర్శి సురేంద్రబాబు కలసి న్యాయమూర్తికి వీడ్కోలు పలికారు.

12న మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

కడప రూరల్: నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేయుటకు ఈ నెల 12వ తేదీన మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలను చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. కడప.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్ సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తును వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఆ దరఖాస్తుకు సంబంధిత సర్టిఫికెట్స్‌ను జతపరచి ఈ నెల 12వ తేదీన కడపలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ వీసీగా ఆచార్య ఫజల్ రెహమాన్



ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ఆచార్య పి. ఫజల్ రెహమాన్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించిన ఆచార్య మునగల సూర్యకళావతి పదవీకాలం ముగియడంతో ఆమె స్థానంలో పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో కర్నూలు అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌ను నియమిస్తూ ఉన్నత విద్య ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జె. శ్యామల రావు ఉత్తర్వులు జారీచేశారు.

● కర్నూలు పట్టణానికి చెందిన ఎస్.ఎ. సిద్దిఖీ, నూరున్నిసాల కుమారుడైన ఈయనకు 29 సంవత్సరాలకు పైగా బోధన, పరిశోధన అనుభవం ఉంది. ఎస్వీయూ నుంచి బీఎస్సీ పూర్తి చేసిన ఈయన ఎంఎస్సీ అగ్రికల్చర్ (నెమటాలజీ), ఎంఫిల్, పీహెచ్‌డీ అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం నుంచి పూర్తి చేశారు. 2001-2004 వరకు హైదరాబాద్ మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయం డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2004-07 వరకు రీడర్‌గా, 2007-14 వరకు ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2013-19 వరకు జువాలజీ ప్రొఫెసర్‌గా, 2019-22 వరకు యూజీసీ హ్యూమన్ రీసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్‌గా పనిచేశారు. పలు బోర్డులు, పలు సంస్థల్లో సభ్యులుగా ఉన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ సభ్యులుగా కూడా పనిచేశారు. అనంతరం ప్రస్తుతం కర్నూలులోని డా. అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

కోలాహలం

● జిల్లా అంతటా ప్రారంభమైన పెద్ద పండుగ సందడి
● ఎక్కడ చూసినా రంగవల్లుల పోటీలతో ఆహ్లాదకర వాతావరణం
● పలు చోట్ల దర్శనమిస్తున్న డూడూ బసవన్నలు



తంబళ్లపల్లె మండలంలోని భవిత కేంద్రంలో గంగిరెద్దు సందడి

జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా రంగవల్లికలు వేస్తున్న మహిళా పోలీసులు, వారి కుటుంబసభ్యులు



సాక్షి రాయచోటి : పల్లెలు, పట్టణాల్లో సంక్రాంతి సందడి కనిపిస్తోంది. పండుగకు నాలుగు రోజుల ముందునుంచే హడావుడి కనిపిస్తోంది. ముందస్తు వేడుకలతో కొత్త సందడి నెలకొంది. ఎక్కడికక్కడ రంగవల్లుల రమణీయం..పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు, దుకాణాల్లో కొనుగోళ్లతో కొత్త వాతావరణం అవతరించింది. ఇప్పటికే సంక్రాంతి పండుగ తరుణంలో అత్తాగారింటికి వచ్చేందుకు కొత్త అల్లుళ్లు ఊర్లకు వస్తుండగా పల్లె సీమల్లో పందేళ్లతో పండుగ కళ కనిపిస్తోంది.

● అన్నమయ్య జిల్లాలో ఈనెల 14, 15, 16 తేదీల్లో బోగి, సంక్రాంతి, కనుమ పండుగలు చేసుకుంటున్న తరుణంలో ఎక్కడ చూసినా రంగవల్లులు పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రమైన రాయచోటిలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆధ్వర్యంలో పోలీసుశాఖ నిర్వహించిన రంగవల్లుల పోటీలకు భారీగా మహిళా పోలీసులు హాజరై ముగ్గులు వేశారు. పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. విజేతలకు కలెక్టర్, ఎస్పీ సతీమణులు స్నేహ, శృతి బహుమతులు అందజేశారు. అలాగే తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాజంపేట తదితర ప్రాంతాల్లో కూడా పాఠశాలలు, ఇతర ప్రాంతాల్లో రంగవల్లుల సందడి నెలకొంది. తంబళ్లపల్లె మండలంలోని భవిత కేంద్రంలో బసవన్నల ఆటపాటలు, బోగి మంటలు, రేగి పండ్లతోచిన్నారులకు స్నానాలు నిర్వహించారు. హరిదాసుల సంకీర్తనలతో కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకునేలా నిర్వహించారు.

అరటిపిలకలతో జిల్లా పోలీసు కార్యాలయం అలంకరణ

సంక్రాంతి సంబరాల్లో భాగంగా రాయచోటిలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద అరటిమట్టలు, టెంకాయ పట్టలు,మామిడి తోరణాలతో అలంకరణ చేశారు. పల్లెలు, పట్టణ వాసులు కూడా పండుగ నేపథ్యంలో షాపింగ్‌తో బిజీబిజీగా గడుపుతుండడంతో కోలాహలం కనిపిస్తోంది. అందరూ కలుసుకుని నిర్వహించుకునే పండుగ కావడంతో సంక్రాంతికి దూరాన ఉన్న బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు ఇప్పుడిప్పుడే కదిలి వస్తుండడంతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది.

విజేతలకు బహుమతులు

రాయచోటి: సంప్రదాయ సంక్రాంతిని సంబరంగా జరుపుకుందామని ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలతో జిల్లా కలెక్టర్, ఎస్పీల సతీమణులు స్నేహ పీఎస్, వి.శృతి హర్షవర్ధన్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఎస్పీ సతీమణి వి.శృతిహర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పోలీసు సిబ్బంది, వారి కుటుంబసభ్యులకు, మహిళా పోలీసులకు రంగవల్లి పోటీలు నిర్వహించారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సంక్రాంతి ముందస్తు సంబరాలు మిన్నంటాయి. మహిళలు రంగవల్లులను ఒకదాని మించి మరొకటి తీర్చిదిద్దారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి జిల్లా కలెక్టర్ సతీమణి స్నేహ పీఎస్, ఎస్పీ సతీమణి శృతిహర్షవర్ధన్, రాయచోటి సబ్ డివిజన్ డీఎస్పీ, ఎస్బీ, ఎస్టీ సెల్ డీఎస్పీల సతీమణిలు బహుమతులను అందజేశారు.



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీల సతీమణులు స్నేహ,శృతి

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

మదనపల్లె సిటీ: విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల సక్రమ అమలుకు పాఠశాలలలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ మర్తాల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మదనపల్లె మండలం సీటీఎంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అటల్‌టింకరింగ్ ల్యాబ్,టీచింగ్ బుక్స్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ పాఠ్యాంశాలకు సంబంధించి ప్రణాళిక, టీచింగ్ డైరీ కలిగి ఉండాలన్నారు. తమ సబ్జెక్టులకు సంబంధించి ప్రతి విద్యార్థి చేత వర్క్ బుక్ పూర్తి చేయించాలన్నారు. నోట్ బుక్స్ రాశారా లేదా పరిశీలించి తప్పనిసరిగా సంతకం చేయాలన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలలకు వచ్చేటప్పుడు జగనన్న విద్యాకానుక షూ, బ్యాగ్ వంటివి తప్పక కలిగి ఉండాలన్నారు. జగనన్న గోరుముద్దకు సంబంధించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందేలా చూడాలన్నారు. నాడు నేడు ఫేజ్-1 స్కూల్‌లో డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ (ఆర్‌ఓ ప్లాంటు) పని చేసే విధంగా చూసుకోవాలన్నారు.ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం రుషికేశవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి

పెద్దమండ్యం: పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించి పాఠశాల విద్యను తీర్చిదిద్దడమే పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్‌స ఫర్ రైజింగ్ ఇండియా) లక్ష్యమని ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక మోడల్ పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు.మదనపల్లె డివిజనల్ ఉప విద్యాశాఖ అధికారి క్రిష్ణప్ప, ఎంఈవో మనోహర, ప్రిన్సిపల్ రామాంజులునాయక్, పాల్గొన్నారు.

గుర్రంకొండ: రెండో విడత నాడు-నేడు పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని కడప ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుర్రంకొండ తెలుగుజెడ్పీహైస్కూల్, కంచ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలల్లో నాడునేడు పనులు తనిఖీ చేశారు. జెడ్పీహైస్కూల్‌కు నాడు-నేడు పథకం రెండో విడత కింద రూ.1.14కోట్లు మంజూరైనట్లు ఎంఈవో సురేంద్రబాబు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈనిధులతో చేపట్టిన పనులపై ఆర్జేడీ ఆరా తీశారు.

నిత్యపూజ స్వామి తలనీలాల కోసం వేలం

● రూ.5,77,000 లకు దక్కించుకున్న నంద్యాల జిల్లా గొడుగునూరు వాసి



వేలం నిర్వహిస్తున్న ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి

సిద్దవటం: వైఎస్సార్‌జిల్లా సిద్దవటం మండలం వంతాటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న శ్రీ నిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల వేలం పాటను నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం గొడుగునూరు గ్రామానికి చెందిన కోటపాటి వెంకటనరసమ్మ అనే మహిళ రూ.5,77,000 లకు దక్కించుకున్నారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. సిద్దవటంలోని శ్రీరంగనాయకస్వామి ఆలయంలో మంగళవారం వేలం పాట నిర్వహించారు. ఇందులో వైఎస్సార్ జిల్లా మైదుకూరు, ప్రొద్దుటూరు, నంద్యాల జిల్లా చాగలమర్రి, నంద్యాల, ఏలూరు, సిద్దవటం మండలం వంతాటిపల్లె, జ్యోతి ప్రాంతాలకు చెందిన 11 మంది పాల్గొన్నారన్నారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది స్వామి వారికి అదనంగా రూ. 27,000 ఆదాయం వచ్చిందన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లాలో క్రీడాభివృద్ధికి విశేషంగా కృషిచేస్తున్నామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణ పరిధిలోని నక్కలవాండ్లపల్లి సమీపంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సంబంధించిన పనులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ప్రభుత్వవిప్, అసెంబ్లీ వ్యవహారాల సమన్వయకర్త, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి సంయుక్తంగా పరిశీలించారు. అనంతరం వారు అక్కడ జరుగుతున్న పనుల తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా క్రికెట్ స్టేడియం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. స్టేడియం వరకు వచ్చేందుకు రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. అత్యంత సుందరంగా క్రికెట్ స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● అన్నమయ్య జిల్లా పరిధిలో పనిచేయని క్వారీలను ఫిబ్రవరి నెల చివరికల్లా వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 307 క్వారీలు ఉన్నాయని, ఇందులో 77 పనిచేయనివి ఉన్నాయన్నారు. వాటిని వచ్చేనెల లోపల వర్కింగ్‌లోకి తీసుకురావాలన్నారు. మైన్స్ అండ్ జియాలజీ డీడీ వెంకటేశ్వరరెడ్డి, ఏడీలు రవి ప్రసాద్, వేణుగోపాల్, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజు, క్వారీ లీజుదారులు, తదితరులు పాల్గొన్నారు.



స్టేడియం నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని కొత్తపల్లె రెండో వార్డులోని పూలతోట హరిజనవాడలో రూ.1.06 కోట్ల నిధులతో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌తో కలిసి ప్రభుత్వ విప్, అసెంబ్లీ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం వేదపండితుల పూజలు, ముస్లిం మతపెద్దల ప్రత్యేక ప్రార్థనలు గావించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మిస్తోందన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైద్య, విద్యరంగాలకు ప్రభుత్వం పెద్దపీట:ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రభుత్వ విప్, అసెంబ్లీ వ్యవహారాల సమన్వయకర్త, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య, విద్యరంగాలకు జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. పట్టణాలలో ప్రాథమిక ఆరోగ్యవ్యవస్థను మరింత పటిష్ట పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వైద్యసదుపాయాలు, వైద్యాధికారులు, సిబ్బంది తగినంత స్థాయిలో ఉన్నారన్నారు. రాయచోటి పట్టణంలో నాలుగు డాక్టర్ వైఎస్సార్ అర్బన్ క్లినిక్‌లు మంజూరయ్యాయని, నేడు ఒకటి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన 3 కూడా నిర్మాణాలు పూర్తయ్యాయని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వాసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో నిర్మాణదశలో ఉన్న వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణాలు మార్చికల్లా పూర్తవుతాయన్నారు.అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే కొత్తపల్లె వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలోమొక్కలు నాటి నీళ్లు పోశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, డీఎం అండ్ హెచ్‌ఓ కొండయ్య, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, కౌన్సిలర్ సుగవాసి పద్మావతి, మునిసిపల్ డీఈ సుధాకర్‌నాయక్, ఏఈ కృష్ణారెడ్డి, ఆర్‌ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు పక్కాగా ఏర్పాట్లు

రాయచోటి : భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి ఈ నెల 26న పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే భారత గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య నూతన జిల్లాలో గత ఏడాది ఆగస్టు 15 మొదటిసారిగా నిర్వహించిన భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అధికారులందరూ సమన్వయంతో విజయవంతం చేశారన్నారు. ఈసారి కూడా భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖల ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. 26వ తేదీన ప్రతి సచివాలయంలో జాతీయ జెండా ఎగురవేసేలా తగు ఉత్తర్వులు జారీ చేయాలని డీఆర్‌ఓకు సూచించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ పోలీస్ శాఖపరంగా తీసుకోవాల్సిన అన్ని చర్యలను పటిష్టవంతంగా పూర్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓ రంగస్వామి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి తాగునీటి వసతి



నూతన పింఛన్ లబ్ధిదారులకు నగదు అందజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు

ఎంపీ, ప్యానల్ స్పీకర్ పీవీ మిథున్ రెడ్డి

కలికిరి: త్వరలో ప్రతి కుగ్రామానికి తాగునీటి వసతి కల్పించనున్నట్లు పార్లమెంటు సభ్యులు, ప్యానల్ స్పీకర్ పీవీ మిథున్ రెడ్డి తెలిపారు. గండికోట నుంచి పీలేరు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్ళపల్లె నియోజకవర్గాలకు తాగునీటి పైపు లైన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. కలికిరి పట్టణంలోని ఏహెచ్‌సీ కల్యాణ మండపంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎంపీ మాట్లాడుతూ వేల కోట్ల నిధులతో నాలుగు నియోజకవర్గాల్లోని ప్రతి పల్లెకు పైపులైను ద్వారా తాగునీరు ఇవ్వడం జరుగుతుందని, దీంతో గ్రామాల్లో తాగునీటి బోర్లు అవసరం ఉండదన్నారు. జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులు, సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కలికిరి పట్టణ ప్రజలు తాగునీరు కొనే పనిలేకుండా పూర్తి స్థాయిలో నీటిశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు.గతంలో జరిగిన అరాచక, అవినీతి టీడీపీ పాలన, ఇప్పుడు జరుగుతున్న ప్రజా సంక్షేమం, అభివృద్ధిని బేరీజు వేసుకుని మంచి చేసిన ప్రభుత్వానికి ఓటు వేటువేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అడుగుతున్నారని, ప్రజలు ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

'సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలనపై పక్క రాష్ట్రాల్లో సైతం ఆశ్చర్యం

రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ పాలనపై పక్క రాష్ట్రాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆశ్చర్యం వక్తం చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం తెలంగాణా రాష్ట్రంలో పర్యటించగా అక్కడి మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా సంక్షేమంపై చాలా ఆసక్తికరంగా మాట్లాడారన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల అరాచకాలు, దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. నిరంతరాయంగా ఇలాంటి ప్రజా సంక్షేమ పథకాలు అమలు కావాలంటే 2024 ఎన్నికలలో మరోసారి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.ఇందుకోసం ప్రతి నాయకుడు, కార్యకర్త ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి రెడ్డి మాట్లాడారు. అనంతరం నూతనంగా ఫించను మంజూరైన లబ్ధిదారులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, డైరెక్టర్ హరీష్ రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కరీముల్లా, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, బీసీ సంఘం నాయకులు జబ్బాల శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ బరకం రవికుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, సీకాం సురేంద్రనాథరెడ్డి, గంగయ్య, హబీబ్ బాషా, మైనారిటీ నేతలు డాక్టర్ ఫయాజ్ అహ్మద్, ఆఘామొహిద్దీన్, అబ్దుల్ కలీం, బావాజీ, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా ...



లాంగ్ జంప్‌లో పాల్గొన్న మహిళా కానిస్టేబుళ్లు

వైఎస్సార్ జిల్లా కడప నగరంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో రెండవరోజున మంగళవారం ఉత్సాహంగా జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ -2023 కొనసాగింది. జిల్లాలోని ఆరు పోలీస్ సబ్ డివిజన్‌ల నుంచి పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు. హాకీ, వాలీబాల్, కబడ్డీ, పుట్‌బాల్, బాస్కెట్‌బాల్, మహిళలకు కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగంలో పరుగుపోటీలతో పాటు, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో విభాగాల్లో పోటీలు జరిగాయి. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఏ.ఆర్. అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏ.ఆర్.డిఎస్పీ రమణయ్య పర్యవేక్షించారు. -కడప అర్బన్

క్లుప్తంగా

టీడీపీ నాయకుడిపై కేసు నమోదు

నిమ్మనపల్లె : గ్రామానికి దారి సౌకర్యం లేకుండా అడ్డుకుని గ్రామస్తులను ఇబ్బందులు పెడుతున్న అగ్రహారం పంచాయతీ మంచిగుంటపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు నరేంద్రపై నిమ్మనపల్లె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మంచిగుంటపల్లెలో చాలా కాలంగా గ్రామస్తులు వినియోగించుకుంటున్న రహదారిని తన సొంత భూమిగా పేర్కొంటూ టీడీపీ నాయకుడు నరేంద్ర ఎవరూ రాకపోకలు సాగించకుండా గుంతలు తవ్వి కంచె వేశారు. దీనిపై గ్రామస్తులు ఆయనతో అనేక మార్లు చర్చలు జరిపినా ఫలితం లేకపోగా, కోర్టులో ప్రైవేట్ కేసు వేసి ఇబ్బందులకు గురిచేశాడు. ఈ నేపథ్యంలో జనవరి 8వ తేదీ సాయంత్రం మంచిగుంటపల్లెకు చెందిన కె.నరసింహులు ఆ దారి మీదుగా పశువులకు గడ్డికోసం వెళుతుండగా.. అదే సమయంలో అక్కడ ఉన్న నరేంద్ర రెడ్డివారిపల్లెకు చెందిన హరితో కలిసి వెళ్లకుండా అడ్డగించారు. ఇరువురికి వాగ్వివాదం జరగడంతో నరసింహులును గాయపరిచారు. స్థానికంగా ఉన్న వారు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితుడు నరసింహులు తండ్రి కదిరప్ప సోదరుడు కె.భాస్కర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నరేంద్ర, హరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఫాతిమా తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


మృతి చెందిన నాగేశ్వరి

కేవీపల్లె : ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గర్నిమిట్టలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లోకేష్ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. గర్నిమిట్టలో నివాసం ఉంటున్న మంజునాథ భార్య నాగేశ్వరి (24) బస్టాండు ప్రాంతంలో గాజులు, పూసల చిరు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తుండేది. ఈ క్రమంలో పక్కనే ఉన్న టీవీ మెకానిక్ నరసింహులుకు కొంత నగదు అప్పుగా ఇచ్చింది. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని సోమవారం సాయంత్రం నరసింహులు ఇంటి వద్దకు వెళ్లి ఆయనను కోరింది. అయితే నరసింహులు భార్య లక్ష్మీ దుర్భాషలాడటమే కాకుండా నాగేశ్వరిపై దాడి చేసింది. దీంతో తీవ్ర అవమానానికి గురైన నాగేశ్వరి సోమవారం రాత్రి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త మంజునాథ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గజ గజ



- వణికిస్తున్న చలి
- మూడు రోజుల నుంచి పెరిగిన తీవ్రత
- ఉదయం 9 గంటల వరకు పొగమంచు
- వరి పంటపై తీవ్ర ప్రభావం.. ఆందోళనలో అన్నదాతలు

వైఎస్సార్ జిల్లాలో గత 5వ తేదీ నుంచి నమోదైన కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రత వివరాలు

తేదీ	కనిష్టం	గరిష్టం
5.1.23	18.4	30.3
6.1.23	17.6	31.0
7.1.23	17.7	30.0
8.1.23	17.7	29.9
9.1.23	11.6	30.7
10.1.23	18.3	30.1

కడప అగ్రికల్చర్ : శీతాకాలం తడాఖా చూపిస్తోంది. కొన్ని రోజులుగా జిల్లా ప్రజలు చలితో వణికిపోతున్నారు. మొదట్లో తీవ్ర ప్రభావం చూపింది. తర్వాత కొంత వరకు తగ్గింది. అయితే ఇటీవల పంజా విసురుతోంది. దీంతోపాటు రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. అలాగే ఉదయం 9 గంటల వరకు పొగమంచు ఆవరించడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. పట్టణాల్లో ఫుట్‌పాత్, పూరి గుడిసెల్లో నివసించే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులపై పొలాలకు వెళ్లే రైతులు గజగజ వణికిపోతున్నారు. జిల్లాలో చాలా ప్రాంతాల్లో వరిపంట చిరుపొట్ట దశలో ఉంది. ఈ పొగమంచుతో వెన్నులోకి మంచునీరు దిగడంతోపాటు ఈ వాతావరణం కారణంగా తాలుగింజలు వచ్చే అవకాశం ఉందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

కప్పేస్తున్న మంచు దుప్పటి

కొన్ని రోజులుగా ఉదయం 9 గంటల వరకు పొగమంచు కురుస్తోంది. దీంతోపాటు పంట పొలాలు, గ్రామాలు, రహదారులు కనిపించకుండా మంచు కప్పేస్తోంది. జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు జ్వరం, జలుబు బారిన పడుతున్నారు. పర్యవసానంగా ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

పొంచి ఉన్న కరోనా

కరోనా పొంచి ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ చలిగాలులతో జలుబు, దగ్గు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ఈ చలి తీవ్రతతో జనాలు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది.

జాగ్రత్తలు పాటించాలి...



అస్తమా, అలర్జీ ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే చలి తీవ్రత వల్ల వ్యాధి ఎక్కువ అవుతుంది. చలిగాలుల్లో తిరగరాదు, చిన్న పిల్లలను తిప్పకూడదు. స్వెటర్లతోపాటు చెవులు కప్పే విధంగా ఉంటే టోపీలు వాడుకోవాలి. కాచి చల్లార్చిన నీరు తాగితే ఆరోగ్య రీత్యా మంచిది.

– డాక్టర్ అవ్వారు అర్జున్‌కుమార్, ప్రముఖ వైద్యులు, కడప.

హమ్మయ్యా..

శునకానికి 'కష్టం' నుంచి విముక్తి


మూతికి డబ్బా ఇరుక్కోవడంతో ఇబ్బంది పడుతున్న శునకం (ఫైల్)


డబ్బా తీసిన తర్వాత హాయిగా సేదదీరుతున్న కుక్క

కురబలకోట : కురబలకోట దగ్గరున్న డీఆర్ నగర్‌లో మూతికి ఇరుక్కున్న డబ్బా నుంచి శునకానికి ఎట్టకేలకు మంగళవారం విముక్తి లభించింది. 'అయ్యో.. పాపం..' 'మూతికి డబ్బా ఇరుక్కుని యాతన' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో మంగళవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. డీఆర్ నగర్‌కు చెందిన ప్రసాద్ మిత్ర బృందం అతి కష్టం మీద శునకం వెంటపడి పట్టుకున్నారు. ఎట్టకేలకు దాని మూతికి ఇరుక్కున్న డబ్బాను తొలగించారు. పది రోజులుగా పడుతున్న యాతన నుంచి విముక్తి కల్పించారు. అయితే అదే సందర్భంలో ఆ శునకం డబ్బాను తొలగించిన ప్రసాద్‌ను కరవడానికి ప్రయత్నించింది. చిన్నపాటి కాటును కూడా వేసింది. ఇన్నాళ్లు మూతికి డబ్బాతో తిండి తినలేక, నీళ్లు తాగలేక ఇబ్బందులు పడింది. మానవత్వంతో శునకం మూతికి ఇరుక్కున్న డబ్బాను యువకులు తీసి వేశారు. డబ్బాను తొలగించి తర్వాత.. తిండి నీళ్లు పెట్టారు. ప్రసాద్ అతని మిత్ర బృందాన్ని స్థానికులతోపాటు అధికారులు అభినందించారు.

మదనపల్లెలో వైఎస్సార్‌సీపీ మెగా జాబ్‌మేళా


వైఎస్సార్‌సీపీ మెగా జాబ్‌మేళా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

- 5,000 మందికి ఉద్యోగావకాశాలు
- ఫిబ్రవరి 10న బీటీ ప్రభుత్వ కళాశాలలో నిర్వహణ
- ఏర్పాట్లపై ఎమ్మెల్యే నవాజ్‌బాషా సమీక్ష

మదనపల్లె : పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10వ తేదీన వైఎస్సార్‌సీపీ మెగాజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెగా జాబ్‌మేళా ఏర్పాట్లకు సంబంధించి నియోజకవర్గ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించాలని ఎంపీ మిథున్‌రెడ్డి నిర్ణయించారన్నారు. అందులో భాగంగా బీటీ కళాశాలలో జరిగే జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీలైన ఆక్సిస్‌బ్యాంక్ లిమిటెడ్, శ్యామ్‌సంగ్ ఇండియా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, అమెజాన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్ ప్రై.లిమిటెడ్, వొడాఫోన్ ఐడియా లిమిటెడ్, భారతి ఎయిర్‌టెల్ సర్వీసెస్ లిమిటెడ్, డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్, ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్, థిస్సెన్‌క్రుప్ ఇండస్ట్రీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఇన్‌స్టాకార్ట్ సర్వీసెస్ ప్రై.లిమిటెడ్, రేడియంట్ అప్లయన్సెస్ అండ్ ఎలక్ట్రానిక్స్ ప్రై.లిమిటెడ్, ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్, డీబీఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్, క్రెడిలో ఫైనాన్షియల్ టెక్నో, బాటా ఇండియా లిమిటెడ్, అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ పాల్గొంటాయన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకుని కమ్యూనికేషన్ నైపుణ్యం కలిగిన యువకులకు ఈపీఎఫ్‌ఓ, ఈఎస్‌ఐ, ఇతర అలవెన్సులతో రూ.12 వేల నుంచి 35 వేల వరకు వేతనంతో 5,000 మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మెగాజాబ్‌మేళా న్యూఢిల్లీకి చెందిన క్వెస్ కార్ప్‌లిమిటెడ్, సన్నితి ఇనిషియేటివ్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, ఎంపీపీ నరసింహులు, కమిషనర్ ప్రమీల, ఎంపీడీఓలు తాజ్‌మస్రూర్, లీలామాధవి, చలపతిరావు, మెగా జాబ్‌మేళా రిసోర్స్ పర్సన్ శంతన్, కౌన్సిలర్ మేస్త్రీ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్.ఐ.రమణారెడ్డి, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మనీటి సేద్య పరికరాలు వినియోగించుకోండి


బిందు సేద్య పరికరాలను పరిశీలిస్తున్న సూక్ష్మనీటి సేద్య జిల్లా అధికారి వెంకటేశ్వరరెడ్డి

రాజంపేట రూరల్ : సూక్ష్మనీటి పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూక్ష్మనీటి సేద్య జిల్లా అధికారి వెంకటేశ్వరరెడ్డి తెలియజేశారు. మండల పరిధిలోని మేకవారిపల్లి, మిట్టమీదపల్లి, కొల్లావారిపల్లి గ్రామాలలోని రైతులకు ప్రభుత్వం సరఫరా చేసిన బిందు సేద్య(డ్రిప్) పరికరాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. రాయితీపై ప్రభుత్వం పంపిణీ చేసిన పరికరాలను రైతులు ఏ విధంగా ఉపయోగిస్తున్నారనే విషయాలను పరిశీలించారు. బిందు సేద్య పరికరాల ద్వారా ఎరువుల వాడకంపై రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి జీ సురేష్‌బాబు, ఎంఐడీసీ చంద్రశేఖర్‌రెడ్డి, వీహెచ్‌ఏలు విష్ణుకుమార్, సాయిప్రియ, ఎంఐఏఓ గురుసాయి పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంలో మెలకువలు పాటించండి


మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై

రాయచోటి టౌన్ : గొర్రెల పెంపకంలో శాస్త్రీయ పద్ధతిలో మెలకువలు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాయచోటి పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మంగళవారం గొర్రెల పెంపకందార్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధుల నివారణకు సకాలంలో టీకాలు వేయించాలని చెప్పారు. ప్రతి మూడు నెలలకొసారి నట్టల వ్యాధి నివారణ కోసం టీకాలు వేయించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాస నాయుడు, సహాయ సంచాలకులు డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీడీఓకు గాయాలు

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయచోటి ఎంపీడీఓ మల్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప నుంచి రాయచోటికి కారులో వస్తుండగా.. మార్గంమధ్యలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మల్‌రెడ్డికి గాయాలు కావడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితుడిని 108లో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని..

మదనపల్లె : ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన చిత్తూరుజిల్లా చౌడేపల్లె మండలంలో జరిగింది. రాయచోటికి చెందిన బి.రమణ(32) పీలేరు ఇరిగేషన్ కార్యాలయంలో ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో పీలేరు నుంచి పుంగనూరుకు వెళుతుండగా చౌడేపల్లె సమీపంలో ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడ్ని 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు.

ఎన్‌వీఆర్ లేఅవుట్‌లో చోరీ

– రూ.7 లక్షల విలువైన నగలు దొంగతనం

మదనపల్లె : పట్టణంలోని ఎన్‌వీఆర్ లేఅవుట్ శారదానగర్‌లో రూ.7 లక్షల విలువైన నగలు దొంగలించిన సంఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగు చూసింది. వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శారదానగర్‌కు చెందిన మంజుల, తులసీరామప్రసాద్‌రెడ్డి ఇంట్లోని కప్‌బోర్డ్‌లో ఉంచిన 150 గ్రాముల బంగారం చోరీకి గురైన విషయాన్ని బాధితులు ఆలస్యంగా గుర్తించారు. సోమవారం సాయంత్రం ఈ విషయమై బాధితులు ఫిర్యాదు చేశారు. మంగళవారం కేసు నమోదు చేశారు. దీపావళికి నగలు అలంకరించుకుని తిరిగి కప్‌బోర్డులో భద్రంగా దాచి ఉంచారు. ప్రస్తుతం అవసరమై చూసుకుంటే కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులను విచారణ చేస్తే తెలియదని చెప్పడంతో చివరకు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు క్లూస్‌టీంను రప్పించి ఇంట్లో ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతి చెందిన విజయ్‌కుమార్

చిన్నమండెం : మండల పరిధిలోని చాకిబండ గ్రామం అంబాబత్తిన వాండ్లపల్లెకు చెందిన విజయ్‌కుమార్(20) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతికి సంబంధించిన కారణాలు తెలియరాలేదని ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. దీంతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

ఢీకొన్న కార్లు – ఒకరికి గాయాలు



వేముల : వేముల సమీపంలో గల చెరువు కట్ట వద్ద మంగళవారం కార్లు ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందులలోని ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న నజ్మా కడప నుంచి పులివెందులకు వస్తుండగా.. అదే సమయంలో చెరువు కట్ట సమీపంలోని తోటలో నుంచి కారు రోడ్డుపైకి ఒక్కసారిగా రావడంతో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పురుషోత్తమ అనే వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి.

ఏక వీరమ్మ గుడిలో చోరీ



అమ్మవారి మెడలో మంగళసూత్రాలు అదృశ్యమైన దృశ్యం, హుండీ తాళం తీసి నగదును దోచుకెళ్లిన దృశ్యం

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని జె.వడ్డిపల్లె గ్రామంలో గ్రామ దేవత ఏకవీరమ్మ గుడిలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రోజూ ఉదయం విద్యుత్ దీపాలు ఆర్పేందుకు గ్రామస్తుడు బి.సుబ్బరాయుడు గుడిలోకి వెళ్లగా.. తలుపు తెరచి ఉంటడం గమనించి స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తాళం తీసి నోట్లు తీసుకెళ్లి, చిల్లరను వదిలి వెళ్లారు. హుండీని పగల గొట్టకుండా తాళం చాకచక్యంగా తీసి, గర్భగుడి ప్రవేశ ద్వారం తలుపులు పగుల గొట్టి అమ్మవారి మెడలోని ఏడు మంగళ సూత్రాలను దొంగలించారు. ఈ మంగళసూత్రాలు దాదాపు రూ.30 వేల విలువ చేస్తాయని ఎస్‌ఐ తెలిపారు. గతంలో దొంగతనం చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. గుడిలోపల భద్రత కోసం వెంటనే కమిటీ సభ్యులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్‌ఐ సూచించారు. కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఆంధ్రా జట్టు భారీ స్కోరు


తలపడుతున్న ఆంధ్ర, చండీగఢ్ జట్లు


267 పరుగులు చేసిన కె.మహీప్‌కుమార్


3 వికెట్లు తీసిన ఆంధ్రా బౌలర్ ఆంజనేయులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అంతర్ రాష్ట్రాల అండర్–25 క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు 541 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. 417 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు మంగళవారం బరిలోకి దిగిన ఆంధ్రా జట్టు 161 ఓవర్లలో 541 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని కె.మహీప్‌కుమార్ 267 పరుగులు చేశాడు. టి.విజయ్ 42 పరుగులు చేయగా, సాకేత్‌రామ్ 57 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. చండీగఢ్ బౌలర్ మహమ్మద్ అసద్ 5 వికెట్లు, పరాస్ 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చండీగఢ్ జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 45 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. జట్టులోని తరణ్ ప్రీత్‌సింగ్ 28, పరాస్ 27 పరుగులు చేశారు. ఎ.ఎ.కుమార్ 30 పరుగులు, అర్జున్ శర్మ 4 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఆంధ్రా బౌలర్ ఎం.ఆంజనేయులు 3 వికెట్లు తీశాడు. ఈయనతోపాటు గిరినాథ్‌రెడ్డి, రాజు, సాకేత్‌రామ్, మహీప్ తలా ఒక వికెట్ చొప్పున తీశారు. దీంతో మూడో రోజు ఆట ముగిసింది.